# అల్లాదుర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- సీఎం కేసీఆర్ పాలన ప్రజలకు శ్రీరామ రక్ష
- నిమ్మరసమిచ్చి జేఏసీ నాయకుడి ఆమరణ దీక్షను విరమింపజేసిన ఎమ్మెల్యే
- ప్రజల న్యాయమైన కోరికలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుంటుంది
- అల్లాదుర్గంలో సబ్ డివిజన్‌స్థాయి కార్యాలయం ఏర్పాటు చేస్తాం
- కేసీఆర్ పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అల్లాదుర్గం, అక్టోబర్ 10: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకుసాగుతుందని, ప్రజల న్యాయైన డిమాండ్లను నెరవేర్చడంలో వెనుకంజ వేసే ప్రసక్తేలేదని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేర్కొన్నారు. అల్లాదుర్గంలో సబ్ డివిజన్‌స్థాయిలో పూర్తిస్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరుతూ మండల కేంద్రమైన అల్లాదుర్గం ఐబీ చౌరస్తాలో 46 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. అయితే జేఏసీ నాయకులు కంచరి బ్రహ్మం ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడి అల్లాదుర్గం సంపూర్ణ అభివృద్ధికి అవసరమైన హామీలను పొంది మంగళవారం దీక్ష శిబిరానికి చేరుకున్నారు. అక్కడ దీక్షచేస్తున్న వారితో మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్ సారథ్యంలో అల్లాదుర్గం అభివృద్ధికి అవసరమైన కార్యాచరణను చేపడతామని జేఏసీ నాయకులతో మాట్లాడి నిమ్మరసం ఇచ్చి బ్రహ్మంతో ఆమరణ దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వా తంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు గడిచిన తర్వాత పరిపాలన సంస్కరణలు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయన్నారు. రాష్ట్రంలోని ప్రజలు పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజాస్వామ్యాన్ని మరింతగా చేరువ చేయడానికి కొత్త జిల్లాలు, రెవె న్యూ డివిజన్లు, సబ్ డివిజన్లు, మండలాలు, గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. అలాంటిది అల్లాదుర్గం అభివృద్ధి కోసం కావాల్సిన అన్ని రకాల చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం తండాలను సైతం గ్రామపంచాయతీలుగా చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అల్లాదుర్గం అభివృద్ధి కోసం ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నట్లుగా సబ్‌డివిజన్‌కు మంజూరైన గురుకుల పాఠశాల, సబ్ కోర్టు, ఎస్టీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లామని ఈ విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అల్లాదుర్గాన్ని రెవె న్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయానికి మం త్రి హామీ ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నదన్నారు. అల్లాదుర్గం సంపూర్ణ అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరి మన్ననలతో ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సభ్యుడు కాశీనాథ్, జోగిపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ అల్లాదుర్గం మండలాధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహు లు, టేక్మాల్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, జేఏసీ సభ్యులు రాములు, సంగయ్య, బద్రీనాథ్, బేతయ్య, శ్రీనివాస్, రాంచందర్, కరిముల్లా, శంకరప్ప, గోపాల్, రియాజ్ ఉన్నారు.

# రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్‌గంగాల

శివ్వంపేట, అక్టోబర్ 10: మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆదేశానుసారం శివ్వంపేట మండలంలోని గోమారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నుంచి (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజిం గ్ సెక్రటరీ రమేశ్‌గంగాల తెలిపారు. మంగళవారం పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల,బాలికలకు వాలీబాల్ క్రీడలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికైన జట్టు ఈనెల 19న మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బాలీబాల్ టోర్నమెం ట్‌లో పాల్గొంటుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.12వ తేదీ ఉదయం 9గంటల వరకు వాలీబాల్ క్రీడాకారులు రిపోర్టు చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో గోమారం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కిశోర్‌కుమార్, పీఈటీ పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మెదక్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్

## పిల్లల అతి ప్రవర్తనతోనే నేరాలు

మెదక్ అర్బన్, అక్టోబర్ 10: పిల్లల అతిప్రవర్తన వల్లే ఎక్కువగా నేరాలు జరుగుతున్నాయని మెదక్ జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ అన్నారు. మంగళవారం దవాఖానలో జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక రోగాన్ని మందులతో సరిచేయవచ్చు. కానీ మానసిక వైకల్యాన్ని మాత్రం సరిచేయలేమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మాధురి, డాక్టర్ కిరణ్‌రెడ్డి, న్యాయవాదులు సిద్ధాగౌడ్, సిద్దిరాములు, శారద తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ అమలుకు ప్రత్యేక చర్యలు

జహీరాబాద్ ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 10: శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జహీరాబాద్ డివిజన్‌లో ఎన్నికల ప్రవర్తనానియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నిక కోడ్‌ను రాజకీయ పార్టీలు, ప్రజలు బాధ్యతగా పాటించాలని ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల సంబంధించిన సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేస్తున్నామన్నారు. ఎంసీసీ అమలుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ(స్టాటిస్టికల్ సర్వేలెన్స్), వీవీటీ( వీడియా విజిలెన్స్) వీవీ (వీడియా వ్యూయింగ్ ) అమలు కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామన్నారు. జహీరాబాద్ శాసనసభ నియోజకవర్గంలో ఆదర్శ పోలింగ్ కేంద్రాలు మూడు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున హోర్డింగ్‌లు, పార్టీ బ్యానర్లు, కటౌట్లు తొలిగించేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశామన్నారు.

# ఓఆర్ఆర్‌పై మరో ఎగ్జిట్

జిన్నారం, అక్టోబర్ 10: హైదరాబాద్ పట్టణానికే తలమానికంగా ఉన్న రింగ్‌రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు చాలా తీరాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రవాణా మార్గాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. తాజాగా రింగురోడ్డుపై ఖాజీపల్లి శివారు శంబీపూర్ వద్ద మరో ఎగ్జిట్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు వద్ద ఎగ్జిట్ 3, సుల్తాన్‌పూర్ వద్ద ఎగ్జిట్ 4, దుండిగల్ వద్ద ఎగ్జిట్ 5 ప్రవేశ మార్గాలు ఉన్నాయి. కొత్తగా శంబీపూర్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిట్ సుల్తాన్‌పూర్ తర్వాత ఉండడం తో 4ఏగా ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. శంబీపూర్, మల్లంపేట సమీపంలో 4ఏ ఎగ్జిట్ పాయింట్ ఇవ్వడంతో జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల ప్రతినిధులకు, ప్రజలకు రాకపోకలకు మార్గం సులువైయింది. రింగురోడ్డును చేరుకునేందుకు మల్లంపేట, బాచుపల్లి, నిజాంపేట, అలాగే భౌరంపేట, గండిమైసమ్మ ప్రాంతాల వారికి కూడా 4ఏ ఎగ్జిట్ చేరువైంది.




శంబీపూర్, మల్లంపేట వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన 4ఏ ఎగ్జిట్



పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసు అధికారులు

# ముమ్మరంగా వాహన తనిఖీలు

- పట్టుబడిన రూ.7లక్షల నగదు
- రిటర్నింగ్ అధికారికి అప్పగించిన పోలీసులు

సంగారెడ్డి, అక్టోబరు10: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సంగారెడ్డి జిల్లాలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో డీఎస్పీ రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో రూరల్, పట్టణ ఇన్‌స్పెక్టర్లు సుధీర్‌కుమార్, శ్రీధర్‌రెడ్డిలతోపాటు రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌నాయక్ సిబ్బందితో తనిఖీ చేస్తుంగా రూ.7లక్షల నగదును పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్ఐ రాజేశ్‌నాయక్ వెల్లడించారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా జాతీయరహదారిపై వాహన తనిఖీలు చేస్తుండగా జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్ నర్సింగి వైపునకు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.7లక్షల నగదు దొరికింది. ఇందుకు సంబంధించి వివరాలు అడగ్గా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం తీసుకెళ్తున్నానని తెలిపినట్లు పోలీసులకు చెప్పారు. ఆ నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తే, పరిశీలించి డబ్బులు తరలించిన వ్యక్తికి అందజేస్తారని తెలిపారు. వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని రూరల్ ఎస్సై స్పష్టం చేశారు.

### ముత్తంగి జంక్షన్‌లో విస్తృత తనిఖీలు

పటాన్‌చెరు, అక్టోబర్ 10: ముత్తంగి ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్‌లో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2.4లక్షలతో ప్రయాణిస్తున్న కారుని పట్టుకొని నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదు ఇంటి స్లాబ్ వేసేందుకు తీసుకెళ్తున్నామని రషీద్ అనే వ్యక్తి పోలీసులకు తెలియజేశారు. స్పందించిన ట్రాఫిక్ సీఐ ప్రవీన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టుకున్న నగదును ఎన్నికల అబ్జర్వర్లు, అధికారులు వేసిన కమిటీకి అప్పగిస్తామన్నారు. వారికి సరైన రసీదులు, కారణాలు, బ్యాంక్ లావాదేవీలు, వ్యాపార లావాదేవీలుంటే వివరాలు తెలిపితే డబ్బు తిరిగి ఇస్తారన్నారు.

### తనిఖీల్లో 13 లక్షలు పట్టివేత

నాగల్‌గిద్ద, అక్టోబర్ 10: మండలంలో పోలీసులు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం మోర్గి చౌరస్తా వద్ద ఎస్ఐ సిద్దిరాములు వాహనాలు తనిశఖీ చేశారు. నారాయణఖేడ్ నుంచి గుందేగాం గ్రామం వైపు వెళ్తున్న కారులో రూ. 9లక్షల నగదు పట్టుబడగా, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.4 లక్షల దొరికాయి. మొత్తం రూ.13 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డబ్బుకు సరైనపత్రాలు వారి వద్ద లేకపోవడంతో నగదును ఎన్నికల అధికారికి అప్పగించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులు భద్రతపై ప్రత్యేక నిఘా పెట్టి ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నారు.



ముత్తంగి ఓఆర్ఆర్ జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 10: స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో పీజీ తరగతులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్న ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బాటనీలో 2, కామర్స్ విభాగంలో 3, కంప్యూటర్స్ విభాగంలో 3, గణితం 1, పొలిటికల్ సైన్స్ 2, ఆంగ్లం 2, తెలుగులో 2 పోస్టులు ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని, నెట్,సెట్, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈనెల 13న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాల న్నారు. వివరాలకు 8686030005 నంబరును సంప్రదించాలన్నారు.